సాక్షి
జోగులాంబ గద్వాల

శనివారం । 18 । జనవరి । 2025



వైభవంగా గంధోత్సవం
రంగాపూర్ హజ్రత్ నిరంజన్ షావలీ దర్గా గంధోత్సవం వైభవంగా నిర్వహించారు.
వివరాలు IIలో ▸



ఉమామహేశ్వర క్షేత్రంలో..
ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అశ్వవాహనంపై ఊరేగించారు.
వివరాలు IIలో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 33.3 /16.8
ఉదయం, రాత్రివేళలో చలి తీవ్రత పెరుగుతుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల స్వీకరణ
గద్వాల: రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్‌లో డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువకులకు ఎస్ఎస్‌సీ, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్ సేవలపై వందరోజులు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ జిల్లా డైరెక్టర్ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత కోచింగ్‌లో బీసీ విద్యార్థులకు 75 శాతం రిజర్వేషన్, ఇతర కులాల వారు 25 శాతం రిజర్వేషన్ ప్రకారం ఎంపిక చేస్తారన్నారు. ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 9 వరకు ఆన్‌లైన్‌లో www.tgcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి ఫిబ్రవరి 15 నుంచి కోచింగ్ తరగతులు ప్రారంభిస్తామన్నారు. 39 ఏళ్ల వయసు, గ్రామీణ ప్రాంత వారికి రూ.1.50 లక్షలు, రూ.2 లక్షలు ఉన్న వారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 08546- 293022, 9985 34941లను సంప్రదించాలని సూచించారు.

ఏపీ ఇరిగేషన్ ఎస్ఈతో అలంపూర్ ఎమ్మెల్యే భేటీ



అలంపూర్: నియోజకవర్గంలోని రైతులకు 2.5 టీఎంసీల సాగునీటిని విడుదల చేసినందుకు ఏపీ ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డిని కర్నూలులోని ఇరిగేషన్ కార్యాలయంలో ఎమ్మెల్యే విజయుడు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 2.5 టీఎంసీల ఇండెంట్ నీటిని కేసీ కెనాల్‌కు విడుదల చేస్తే తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సాగునీరు అందకపోయే అవకాశం ఎక్కువ ఉందన్నారు. ఈ క్రమంలోనే రెండు రోజులు ఆలస్యంగా కేసీ కెనాల్‌కు సాగునీరు నిలిపి ఉంచాలని తెలంగాణ రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఆలయ మాజీ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, తిమ్మారెడ్డి తదితరులున్నారు.

సాగుకు యోగ్యం కాని భూములు గుర్తించాలి
మల్దకల్: వ్యవసాయ సాగుకు యోగ్యం కానీ భూములను గుర్తించి నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మల్దకల్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి.. రికార్డులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయాధికారులు, ఆర్ఐలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాలుగు గ్యారంటీల అమలులో భాగంగా గ్రామాల్లో అధికారులు చేపట్టే సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి సాగుకు నోచుకోని భూములు, లే అవుట్ చేసిన భూములు, ప్రభుత్వ భూములను గుర్తించడంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల గుర్తింపుపై సర్వే చేపడుతున్నట్లు వివరించారు. అధికారులు ఎప్పటికప్పుడు సర్వే వివరాలను అందుబాటులో ఉంచుకొని గ్రామసభలలో వివరించాలన్నారు. తహసీల్దార్ జుబేర్ మోయినొద్దీన్, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, డీటీ ఝాన్సీరాణి, ఏఓ రాజశేఖర్, ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ ‘1,247
గద్వాల వ్యవసాయం: పట్టణంలోని మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,247 క్వింటాళ్ల వేరుశనగ రాగా.. గరిష్ఠంగా రూ.6,501, కనిష్ఠంగా రూ.2,390, సరాసరిగా రూ.4,719 ధరలు వచ్చాయి. 11 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్ఠంగా రూ.5,569, కనిష్ఠంగా రూ.5,461, సరాసరిగా రూ.5,569 ధర లభించాయి.

ఆదాయం అంతంతే!

పాలమూరులో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు తగ్గిన రాబడి

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మందగించిన స్థిరాస్తి క్రయవిక్రయాలు
- 2023లో రూ.191.75 కోట్లు.. 2024లో రూ.175.64 కోట్లు రాక

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/మెట్టుగడ్డ: ఉమ్మడి పాలమూరు జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు అంతంతమాత్రంగానే ఆదాయం సమకూరింది. 2023 (ఏప్రిల్-డిసెంబర్)తో పోలిస్తే 2024లో రాబడి గణనీయంగా 36.29 శాతం మేర తగ్గింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువ అమాంతంగా పెరిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వం సైతం రిజిస్ట్రేషన్ విలువను ఎప్పటికప్పుడు పెంచుతూ పోయింది. దీంతో స్థిరాస్తుల క్రయవిక్రయాలు పెరుగుతాయని.. రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుందని పాలకులు భావించారు. కానీ వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. హైదరాబాద్ పరిధిలో అనధికార కట్టడాలు, లేఔట్లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. హైడ్రా పేరిట కూల్చివేతలు చేపట్టడం.. జిల్లా స్థాయిలో కూడా యంత్రాంగం ఏర్పాటు చేసేలా ముందుకు సాగుతుండడంతో ప్రజల్లో ఏవి అక్రమ కట్టడాలు.. ఏది కొంటే ఏమవుతుందోననే భయం నెలకొన్నట్లు తెలుస్తోంది.

తగ్గిన రిజిస్ట్రేషన్లు..
ఉమ్మడి జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో ఇళ్లు, ప్లాట్లు వంటి స్థిరాస్తి లావాదేవీల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. అయితే 2023 (ఏప్రిల్-డిసెంబర్)తో పోలిస్తే 2024లో రిజిస్ట్రేషన్ దస్తావేజులు తక్కువగా రాగా.. అంతంతమాత్రంగానే ఆదాయం సమకూరింది. 2023లో 72,666 రిజిస్ట్రేషన్లు కాగా.. 2024లో 70,030 మాత్రమే రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ లెక్కన 2,636 రిజిస్ట్రేషన్ దస్తావేజులు తక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది.



రాబడి తగ్గింది ఈ ప్రాంతాల్లోనే..
2023 (ఏప్రిల్-డిసెంబర్)తో పోలిస్తే 2024లో ఏడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో రాబడి తగ్గింది. మొత్తంగా 36.29 శాతం మేర ఆదాయం తగ్గినట్లు రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు చెబుతున్నాయి. వనపర్తి (24.98 శాతం), అలంపూర్ (24.01 శాతం), మక్తల్ (22.54 శాతం), జడ్చర్ల (15.37 శాతం), మహబూబ్‌నగర్ (8.93 శాతం), ఆత్మకూర్ (8.85 శాతం), నారాయణపేట (1.32 శాతం) రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రెవెన్యూ తగ్గింది.

ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్లు, ఆదాయ వివరాలు (రూ.కోట్లలో)..

సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం	ఏప్రిల్-డిసెంబర్ 2023		ఏప్రిల్-డిసెంబర్ 2024	
	దస్తావేజులు	రెవెన్యూ	దస్తావేజులు	రెవెన్యూ
అలంపూర్	1,493	2.35	1,305	1.79
గద్వాల	10,156	20.91	10,520	21.29
జడ్చర్ల	12,607	45.74	10,604	38.71
మహబూబ్‌నగర్	11,187	43.39	12,150	39.52
అచ్చంపేట	2,780	4.29	2,784	5.64
కల్వకుర్తి	5,920	13.73	6,597	14.71
కొల్లాపూర్	2,419	3.34	2,769	4.08
నాగర్‌కర్నూల్	5,373	10.01	5,039	10.75
మక్తల్	1,985	5.70	1,631	4.41
నారాయణపేట	5,584	11.05	5,377	10.90
ఆత్మకూర్	1,829	2.60	1,653	2.37
వనపర్తి	11,333	28.64	9,601	21.49
మొత్తం	72,666	191.75	70,030	175.64

25% మార్టిగేజ్ దస్తావేజులే..
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నాలుగైదు కార్యాలయాల్లో మాత్రమే సాధారణంగా దస్తావేజులు నమోదయ్యాయి. వీటిలో ఎక్కువ శాతం మార్టిగేజ్ దస్తావేజులు ఉన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లతో పాటు ప్రైవేట్ బ్యాంక్‌లు, పలు ఫైనాన్స్ సంస్థలు ఇంటి స్థలాలు, ఇళ్ల నిర్మాణాలపై వడ్డీలకు రుణాలందిస్తున్నాయి. ఈ మేరకు జమానత్ కోసం వారి దస్తావేజులను మార్టి గేజ్ చేయించుకుంటున్నారు. అన్ని కార్యాలయాల్లో ఇలాంటి దస్తావేజులే 25 శాతం మేర నమోదవుతున్నట్లు తెలుస్తోంది.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రార్ కార్యాయం

పడిపోయిన ఆదాయం..
మహబూబ్‌నగర్‌తో సహా మొత్తం 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 2023లో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు అంటే తొమ్మిది నెలల కాలంలో రూ.191.75 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. అదేకాలంలో 2024లో రూ.175.64 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ లెక్కన రూ.16.11 కోట్ల తక్కువ రాబడి వచ్చినట్లు తెలుస్తోంది. 2024లో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పోలిస్తే మహబూబ్‌నగర్‌లో అత్యధికంగా రూ.39.52 కోట్లు.. అలంపూర్‌లో అత్యల్పంగా రూ.1.79 కోట్ల ఆదాయం వచ్చినట్లు స్పష్టమవుతోంది.

- మహబూబ్‌నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 2023 (ఏప్రిల్-డిసెంబర్)లో 11,187 దస్తావేజులు రాగా.. రూ.43.39 కోట్ల ఆదాయం సమకూరింది. అదే 2024లో 12,150 దస్తావేజులు రాగా.. రాబడి రూ.39.52 కోట్లు మాత్రమే వచ్చింది. రిజిస్ట్రేషన్ దస్తావేజుల సంఖ్య పెరిగినా.. ఆదాయం తగ్గడం గమనించవచ్చు.
- నాగర్‌కర్నూల్ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయానికి 2023లో 5,373 దస్తావేజులు రాగా.. రూ.10.01 కోట్ల రాబడి వచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. అదే 2024లో 5,039 దస్తావేజులు మాత్రమే రాగా.. రూ.10.75 కోట్ల ఆదాయం సమకూరింది. రిజిస్ట్రేషన్ దస్తావేజుల సంఖ్య తగ్గినా.. ఆదాయం పెరగడం గమనించవచ్చు.

‘హైడ్రా’ భయంతో..



పాలమూరులో చాలా వరకు ప్రజలు ప్లాట్లు కొనాలంటే భయపడుతున్నారు. హైడ్రా భయమే ఇందుకు కారణం. ఎక్కడన్నా కొద్ది పాటి నీళ్లు నిలిచినా.. ఆ భూమిని కొనడానికి ముందుకు వస్తలేరు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. భారీగా పెరిగిన సిమెంట్, స్టీల్ ఇతర సామగ్రి ధరలతో భవనాల నిర్మాణాలు అంతంతమాత్రంగానే కొనసాగుతున్నాయి. దీంతో పాటు గ్రామ పంచాయతీ లేఔట్ రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో రిజిస్ట్రేషన్ల శాఖకు రాబడి తగ్గిందని చెప్పవచ్చు. జీపీల్లో పూర్తిస్థాయిలో లేఔట్ రిజిస్ట్రేషన్లు మొదలైతే రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ పుంజుకునే అవకాశం ఉంది.
– చందుయాదవ్, మహబూబ్‌నగర్ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

మార్చి వరకు టార్గెట్ చేరుకుంటాం



స్థిరాస్తుల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు అనుకున్నంతగా జరగకపోవడంతో రిజిస్ట్రేషన్ శాఖకు అంతగా రాబడి రాలేదని చెప్పవచ్చు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎక్కడ కూడా అనాథరైజ్డ్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ కావడం లేదు. రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత నెలకొనడం, ఇళ్ల నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరగడం వంటివి ప్రభావం చూపుతున్నాయి. ప్రజల్లో హైడ్రా భయం కూడా కారణం కావొచ్చు. మార్చి వరకు టార్గెట్ పూర్తవుతుందనే నమ్మకం ఉంది.
– వి.రవీందర్, జిల్లా రిజిస్ట్రార్

విద్యార్థుల కలల ‘నవోదయం’

నేడు 6వ తరగతిలో ప్రవేశాలకు పరీక్ష

- అరగంట ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతి
- ఉమ్మడి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో దరఖాస్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం
- కొత్త విద్యాలయం అందుబాటులోకి వస్తేనే ప్రయోజనం



వట్టెంలోని జవహర్ నవోదయ విద్యాలయం

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

జిల్లా	పరీక్ష కేంద్రాలు	పరీక్ష రాసే విద్యార్థులు
మహబూబ్‌నగర్	5	1,260
నాగర్‌కర్నూల్	8	1,990
జోగులాంబ గద్వాల	4	967
వనపర్తి	5	1,145
నారాయణపేట	3	696
రంగారెడ్డి	1	329
వికారాబాద్	1	215

గద్వాల టౌన్: నవోదయ విద్యాలయాల్లో ప్రవేశం కోసం ఎంతోమంది విద్యార్థులు కష్టపడుతుంటారు. తల్లిదండ్రులు సైతం ఆ దిశగా పిల్లలను ప్రోత్సహిస్తుంటారు. పల్లె, పట్టణం తేడా లేకుండా చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను నవోదయలో చేర్పించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇక్కడ ఒక్కసారి ప్రవేశం లభిస్తే 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు అందులోనే నాణ్యమైన విద్య అందుతుంది. క్రీడలకూ ప్రాధాన్యం ఉంటుంది. వసతి, భోజనం, పుస్తకాలు, స్టేషనరీ, ఏకరూప దుస్తులు తదితర అన్నీ కేంద్ర ప్రభుత్వమే సమకూరుస్తుంది. ఈ క్రమంలోనే ఉమ్మడి పాలమూరులోని ఏకైక పాఠశాల పాలెం నవోదయ పాఠశాల 6వ తరగతిలో ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహిస్తుండగా.. ఉమ్మడి మహబూబ్‌నగర్ (రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో కొన్ని మండలాలు) జిల్లావ్యాప్తంగా 6,602 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే 80 సీట్లకు ఇంత మంది పోటీ పడాల్సి వస్తోంది. ఈ మేరకు శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. అరగంట ముందు నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు.

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో..
తెలంగాణలో జిల్లాల పునర్విభజన జరిగిన నేపథ్యంలో కొత్త నవోదయ విద్యాలయాలు వస్తే పోటీ తగ్గి ఎక్కువ మంది విద్యార్థులకు అవకాశం వస్తుందని అనేక మంది చాలా కాలంగా ఎదురు చూశారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో కొత్త నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందుకోసం మహబూబ్‌నగర్ శివారులో స్థల పరిశీలన చేశారు. అయితే ఇందులో ఏయే జిల్లాల విద్యార్థులకు అవకాశం ఉంటుందనేది తెలియాల్సి ఉంది. ఈ ఏడాది కొత్త నవోదయ విద్యాలయంలో సీట్లు భర్తీ చేసి విద్యాలయాన్ని అందుబాటులోకి తేస్తారా.. లేదా.. అనేది స్పష్టత లేదు. ఒకవేళ ఈ ఏడాది కొత్త విద్యాలయం కొనసాగకపోతే పాత జిల్లాలనే పరిగణలోకి తీసుకొని విద్యార్థులు ఈ ఏడాది కూడా సీట్ల కోసం తీవ్ర పోటీ పడాల్సిందే. కొత్త విద్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొస్తే పోటీ తగ్గడంతోపాటు విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఆ దిశగా పాలకులు, అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ముందుగానే చేరుకోవాలి..



జవహర్ నవోదయ విద్యాలయం 2025- 26 విద్యా సంవత్సరం ఆరో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. మొత్తం 27 పరీక్ష కేంద్రాల్లో 6,602 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. విద్యార్థులు నిర్ణీత సమయానికి గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
– భాస్కర్‌కుమార్, ప్రిన్సిపల్, జవహర్ నవోదయ విద్యాలయం

విద్యాభివృద్ధికి బాటలు..
తెలంగాణ రాష్ట్రంలో పూర్వం 10 జిల్లాలు ఉండగా.. వీటిలో అర్బన్ జిల్లాకు నవోదయ విద్యాలయాలు ఉండవు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 9 జిల్లాల పరిధిలో తొమ్మిది నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. ప్రతి విద్యాలయంలో 80 సీట్లు ఉంటాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మరికొన్ని నవోదయ విద్యాలయాలను మంజూరు చేసింది. రాబోయే కాలంలో మరికొన్ని విద్యాలయాలను మంజూరు చేస్తామని ప్రకటించింది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన జోగులాంబ గద్వాల జిల్లాకు నవోదయ విద్యాలయం మంజూరైతే ఇక్కడి విద్యార్థులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. అక్షరాస్యతలో వెనకబడిన ఈ ప్రాంతంలో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేస్తే అక్షరాస్యత పెంపుతోపాటు విద్యాభివృద్ధికి బాటలు వేసినట్లవుతుంది. ఆ దిశగా పాలకులు నడిగడ్డలో కొత్త నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కృషి చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

వైభవంగా లక్ష్మీహయగ్రీవస్వామి ఉత్సవాలు



యాగశాలలో వాస్తు హోమాలు చేస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: మండలంలోని బీచుపల్లి కోదండరామ స్వామి ఆలయంలో శ్రీలక్ష్మీహయగ్రీవ స్వామి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆలయంలో విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచణం, శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామి, జ్ఞాన సరస్వతి అమ్మవారికి రక్షా బంధన కార్యక్రమాలు అర్చకులు వేదమంత్రాల మధ్య జరిపారు. అదేవిధంగా యాగశాలలో వాస్తు ఆరాధనలు, వాస్తు హోమాలు, వాస్తు పర్యగ్నికరణం వంటి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజరు సురేందర్‌రాజు, అర్చకులు పాల్గొన్నారు.



కదిలొచ్చిన రథం.. పులకించిన సింగపట్నం



అలంకరణలో ఉత్సవమూర్తులు

ఉమ్మడి పాలమూరులో ప్రసిద్ధిగాంచిన సింగోటం శ్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవం శుక్రవారం కనులపండువగా సాగింది. పట్టువస్త్రాలు, బంగారు భరణాలు, వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన స్వామివారి కదిలిరావడంతో సింగపట్నం పులకించిపోయింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు ప్రధాన ఆలయం నుంచి రత్నగిరికొండ వరకు స్వామివారి రథాన్ని లాగి పునీతులయ్యారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు నమో.. శ్రీలక్ష్మీనారసింహాయ నామస్మరణతో మార్మోగింది.
– కొల్లాపూర్/ కొల్లాపూర్ రూరల్

వివరాలు IIలో..

ఆదిశిలాక్షేత్రం హుండీ ఆదాయం రూ.25,62,300



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూగా వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామికి భక్తులు హుండీలో సమర్పించిన కానుకల ద్వారా రూ.25,62,300 ఆదాయం సమకూరిందని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో హుండీ లెక్కింపు నిర్వహించగా.. గద్వాల ఎస్‌వీఎస్ సేవా సంఘం నిర్వాహకుడు అభిలాష్, ఆధ్వర్యంలో 120 మంది మహిళలు, గట్టుకు చెందిన శ్రీ భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం రూ.25,62,300 ఆదాయం సమకూరగా చింతలాముని నల్లారెడ్డి స్వామి హుండీ ఆదాయం రూ.1,32,406 వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. గతేడాది కంటే ఈసారి రూ.1,55,171 అదనంగా ఆదాయం సమకూరిందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, బాబురావు, మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, నరేందర్, నారాయణ, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్వాల, అయిజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీలకు మంజూరైన నిధులు, వాటి ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యతగా పూర్తి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో చేపడుతున్న అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన స్టోరేజీ రిజర్వాయర్ నీటి సరఫరా పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలన్నారు. 15వ ఫైనాన్స్, సీఎం అష్యూరెన్స్ ఫండ్, జనరల్ ఫండ్ ఇతర మున్సిపల్ నిధులతో ఇప్పటికే చేపట్టిన పనులన్నింటినీ నిర్ణీత సమయంలో చేపట్టాలన్నారు. గద్వాల మున్సిపాలిటీలో ఆడిటోరియం, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ హాల్స్ వంటి పనులు వెంటనే ముగించాలన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు, విద్యుత్ చార్జీలు జనరల్ ఫండ్ ద్వారా వారం రోజుల్లో చెల్లించాలన్నారు. సీఎం అష్యూరెన్స్ మిగులు నిధులతో సమ్మర్ వాటర్ ప్లాన్ కింద వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ నిధులతో అవసరమైన చోట్ల పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.


లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు


గుండంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న ప్రజలు


రథోత్సవాన్ని శ్రీవారి సముద్రం చెరువుకట్ట పైనుంచి తిలకిస్తున్న భక్తులు

క్లుప్తంగా

చెరువులో పడి వృద్ధుడి మృతి


నర్సింలు (ఫైల్)

మహమ్మదాబాద్‌: మండలంలోని ధర్మాపూర్‌కి చెందిన నర్సింలు (75) అనే వృద్ధుడు శుక్రవారం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నర్సింలు ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువు వద్దకు వెళ్లారు. ప్రమాదావశాత్తు జారి చెరువులో పడి మృత్యువాత పడ్డాడు. కేసు నమోదు చేసినట్లుపోలీసులు తెలిపారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


భీముడు (ఫైల్)

మానవపాడు: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపంతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొర్విపాడు గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్‌ కానిస్టేబుల్‌ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం... కొర్విపాడు గ్రామానికి చెందిన తెలుగు భీముడు(34) ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం 5గంటల సమయంలో తుంగభద్ర నది ఒడ్డున పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కర్నూల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య భార్య తెలుగు రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉరేసుకొని యువతి..

మహమ్మదాబాద్‌: ఉరేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని ధర్మాపూర్‌ గ్రామానికి చెందిన కావలి యాదయ్య కూతురు కావలి నవనీత(19) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో నర్సుగా పనిచేస్తోంది. ప్రేమించిన అబ్బాయితో పెళ్లి చేయాలని యువతి కుటుంబసభ్యులను కోరగా వారు తిరస్కరించారు. దీంతో మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోతి దాడిలో యువకుడికి గాయాలు

పాన్‌గల్‌: మండల కేంద్రం పాన్‌గల్‌లో కోతులు దాడి చేస్తున్న సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన లింగాల రంగస్వామి అనే యువకుడు హోటల్‌లో టిఫిన్‌ చేస్తుండగా కోతి దాడి చేసింది. దాడిలో రంగస్వామి కుడి చేతికి తీవ్రగాయమైంది. కోతుల గుంపుల సంచారంతో నానా అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కోతులను నివారించాలని కోరుతున్నారు.

నమో నారసింహా..

వైభవంగా సింగోటం లక్ష్మీనరసింహుడి రథోత్సవం

- లక్ష్మీదేవికి వాయినం సమర్పణ
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- రథోత్సవాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- సురభి రాజవంశ వారసుడు ఆదిత్య లక్ష్మారావు ప్రత్యేక పూజలు
- శ్రీవారి సముద్రంలో స్పీడ్‌ బోట్లు నడిపిన టూరిజం శాఖ
- జాతరలో వెలిసిన తినుబండారాలు, గాజుల దుకాణాలు


స్వామివారికి పూజ చేస్తున్న అర్చకుడు


మంగళహారతి ఇచ్చి రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు


రథాన్ని లాగేందుకు పోటీపడుతున్న భక్తులు

కొల్లాపూర్‌/కొల్లాపూర్‌ రూరల్‌ : రెండో యాదాద్రిగా పిలిచే సింగోటం లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా సాగింది. వేలాది భక్తజన సందోహం మధ్య రథోత్సవం(తేరు) శోభాయమానంగా ముందుకు కదిలింది. నమో నారసింహా.. అంటూ రత్నగిరికొండ పరిసరాలు మార్మోగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు, రాయలసీమ నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వేలాదిగా తరలివచ్చారు. కల్యాణమూర్తులైన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు సురభి రాజవంశ వారసుడు ఆదిత్య లక్ష్మారావు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. చెంచులు ఆనవాయితీ ప్రకారం తమ ఆడబిడ్డ అయిన లక్ష్మీదేవికి వాయినం సమర్పించారు. వివిధ కులాలకు చెందిన తమ సంప్రదాయాల ప్రకారం ఉత్సవ పూజల్లో భాగస్వాములు అయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు సంపత్‌కుమార్‌ శర్మ పర్యవేక్షణలో ఉత్సవ మూర్తులను సాయంత్రం రథంపై కూర్చొబెట్టారు. రాష్ట్ర ఎక్సైజ్‌, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దేవతామూర్తులకు మహా మంగళహారతి ఇచ్చి రథోత్సవాన్ని లాంచనంగా ప్రారంభించారు. కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌ ఉత్సవ మూర్తులకు పూజలు చేసి మంత్రి, కలెక్టర్‌ రథం ముందు నడిచారు. కొల్లాపూర్‌ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావుతో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు దేవతామూర్తులను దర్శించుకొని రథోత్సవంలో పాల్గొన్నారు. ప్రధాన ఆలయం నుంచి రత్నగిరికొండ వద్ద గల జమ్మిచెట్టు వరకు రథోత్సవం వెళ్లి వెనుతిరిగింది. రథంపై ఉన్న ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలు తరలివచ్చారు. ఆలయ సమీపంలో వున్న గుండంలో భక్తులు పుణ్యస్నానాలు చేశారు.


రథోత్సవంలో మహిళల కోలాట ప్రదర్శనలు

జాతరలో తినుబండారాల, గాజుల దుకాణాలు కిక్కిరిశాయి. శ్రీవారి సముద్రం రిజర్వాయర్‌లో టూరిజం శాఖ అధికారులు ప్రజలు పర్యటించడానికి స్పీడ్‌ బోట్లు ఏర్పాటుచేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. కృష్ణానది మీదుగా మరబోట్ల ద్వారా ప్రయాణాలు నిలిపివేయడంతో రాయలసీమ నుంచి వచ్చే భక్తుల సంఖ్య కొంత మేర తగ్గింది.

విధుల్లో నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు

కొల్లాపూర్‌ రూరల్‌: సింగోటం శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. శుక్రవారం ఉదయం సింగోటం గ్రామ సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాలను ఆయన కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నివసతులు భక్తులకు కల్పించాలని అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. పలువురు భక్తులతో స్వయాన వసతులపై ఆరా తీశారు. ఈనెల 21 వరకు జాతర జరుగుతుందని వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. అక్కడనే వున్న వైద్యశిబిరాన్ని కలెక్టరుతో కలిసి సందర్శించారు. జాతరలో 24 గంటలు వైద్యులు అందుబాటులో వుండాలన్నారు. అత్యవసర పరిస్థితులో ఉండే అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జాతరలో పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, లేనిపక్షంలో జిల్లా పంచాయతీ అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రాంమోహన్‌ రావు, ఆర్డీఓ బన్సీలాల్‌, తహసీల్దార్‌ విష్ణువర్ధన్‌ రావు, విద్యుత్‌ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర క్షేత్రంలో అశ్వవాహన సేవ


అశ్వవాహన సేవలో పాల్గొన్న భక్తులు

అచ్చంపేట: నల్లమల కొండల్లో వెలిసిన ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్రవారం రెండోరోజు సాయంత్రం ప్రదోష కాలంలో నిర్వహించిన అశ్వవాహన సేవకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరయ్యారు. ఉమామహేశ్వరం ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు ఉమాసదులను అశ్వవాహనంలో ఊరేగించారు. వేదపడింతుల మంత్రోచ్చరణల మధ్య మంగళ వాయిద్యాలతో ఉమామహేశ్వర స్వామి సంకీర్తన చేస్తూ భజన బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తుల జయజయ ధ్వానాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఉదయం ఆలయం నుంచి ఆలయంలో గవ్యాంత పూజలు, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన పూజలు, రుద్రాభిషేకం, రుద్రహోమం, దుర్గా సూక్త హోమాలు, మృగ యాత్ర వినోదం, నీరాజన మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ కమిటీ చైర్మన్‌ బీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పవన్‌, సైదులు, అర్చకులు వీరయ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్ట్‌కు 3072 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని, ఆవిరి రూపంలో 61క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 640 క్యూసెక్కులు, కుడి కాల్వకు 600 క్యూసెక్కులు మొత్తం 1,301 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 9.657టీఎంసీలు కాగా, 6.554 టీఎంసీల నీరు నిల్వఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రామన్‌పాడులో నీళ్లు ఫుల్‌

మదనాపురం: రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటి మట్టం 1,021అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా,640 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్‌ కాల్వ ద్వారా 315 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

నిబంధల మేరకే మైనింగ్‌ తవ్వకాలు

- డిప్యూటీ కలెక్టర్‌ అమరేందర్‌


మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్‌ అమరేందర్‌

బల్మూర్‌: ప్రభుత్వ నిబంధనల మేరకే మైనింగ్‌ తవ్వకాలు జరపాలని డిప్యూటీ కలెక్టర్‌ అమరేందర్‌ సూచించారు. గోదల్‌ శివారులోని సర్వే నెంబర్‌ 121లో హెక్టార్‌ విస్తీర్ణంలో మైనింగ్‌ లీజ్‌ ఏరియాలో తవ్వకాలకు సంబంధించిన అనుమతులపై శుక్రవారం డిప్యూటీ కలెక్టర్‌ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయాలు సేకరించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో పాటు ఎన్‌జీఓలతో అధికారులు అభిప్రాయాలు తీసుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మైనింగ్‌ తవ్వకాలు జరపాలని, నిబంధనలు పాటించాలని వారు కోరారు. కార్యక్రమంలో పొల్యూషన్‌ బోర్డు ఈఈ సురేష్‌, సీఐ రవీందర్‌, తహసీల్దార్‌ శ్రీకాంత్‌, ఎంపీడీఓ రాఘవులు, ఎస్‌ఐ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

31 వరకు వీవీఎస్‌ పొడిగింపు

- జిల్లా ఆదాయపు పన్నుశాఖ అధికారి మనోజ్‌కుమార్‌


సదస్సులో జిల్లా ఆదాయపన్ను శాఖ అధికారి మనోజ్‌కుమార్‌

మెట్టుగడ్డ: ఉమ్మడి జిల్లాలో ఆదాయపు పన్ను కట్టే వారందరికీ వివాద్‌ సే విశ్వాస్‌ స్కీం(వీవీఎస్‌)–2024ను జనవరి 31వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఆదాయపు పన్ను శాఖ అధికారి మనోజ్‌కుమార్‌ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వివాద్‌ సే విశ్వాస్‌ స్కీం పన్ను కట్టేవారికి అనేక అనుకూల అంశాలు ఉన్నాయని వివరించారు. ఆదాయపు పన్ను అసెస్మెంట్‌ చేశాక ఆదాయంపై వచ్చిన ట్యాక్స్‌ నచ్చకపోతే అప్పీల్‌కు పోయేవారిని, దీని కోసం ఇన్‌కాం టాక్స్‌ ట్రిబ్యునల్‌క్‌ పోవాల్సి ఉంటుందని, పన్ను కట్టేవారు డాక్యుమెంటరీ ఎవిడెన్స్‌ సమర్పించాల్సి ఉండేదని తెలిపారు. ఈ స్కీం ద్వారా డిస్ప్యూట్‌ టాక్స్‌ కడితే చాలు అప్పీలు పోవాల్సిన అవసరం లేదన్నారు. ఫ్రెండ్లీగా ఆదాయపు పన్ను కట్టే వారికి అప్పీళ్లను తగ్గించాలనే ఉద్దేశంతో ఈస్కీంను ప్రవేశ పెట్టిందని అన్నారు. ఉమ్మడి జిల్లాలో 10636 మంది తప్పుడు రిఫండ్‌ క్లైమ్‌లు చేశారని, టాక్స్‌ కట్‌ అయితే రిఫండ్‌ వస్తుందన్న భ్రమలో పడుతున్నారని అన్నారు. తప్పుడు రిఫండ్‌ క్లెయిమ్‌ చేస్తే ట్యాక్స్‌ పేయర్లకే ఇబ్బందని, స్క్రూటీనిలో తేలితే పెనాల్టీతో పాటు ప్రాసిక్యూషన్‌ కూడా ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నవారు సెక్షన్‌ 234ఏ, 234బి కింద టాక్స్‌పేయర్లు 20 శాతం, ఆన్‌ డిమాండ్‌ టాక్స్‌ పేచేస్తే 50 శాతం ఇక్కట్లు తగ్గుతాయని, వీవీఎస్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. ఇన్‌కం టాక్స్‌ ఇన్‌స్పెక్టర్‌ నర్మద జంగంతో పాటు చార్టెడ్‌ అకౌంటెంట్లు, ఆడిటర్లు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఎస్‌ఐ జోక్యంపై డీజీపీకి ఫిర్యాదు

నాగర్‌కర్నూల్‌ క్రైం: స్థల వివాదంలో ఎస్‌ఐ జోక్యం చేసుకుని, కొందరికి సహకరిస్తున్నారని జిల్లా కేంద్రానికి చెందిన తిరుపతమ్మ, రాములమ్మ, నిరంజన్‌ శుక్రవారం డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అందులో పేర్కొన్న వివరాలు.. జిల్లా కేంద్రానికి చెందిన తిరుపతమ్మ, రాములమ్మ కు చెందిన పాట్లను అబ్దుల్‌సత్తార్‌, అబ్దుల్‌ రహీం అనే వ్యక్తులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి పొజిషన్‌ సర్టిఫికెట్‌ తీసుకోవడంతో బాధితులు తహసీల్దార్‌ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. విచారణ జరిపిన తహసీల్దార్‌ నకిలీ డాక్యుమెంట్లను రద్దు చేయడంతో.. రహీం తన 11మంది స్నేహితులతో వచ్చి బాధితులపై దాడి చేయడంతో 2023 సంవత్సరంలో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయినట్లు తెలిపారు. పాట్ల విషయంలో ఈనెల 16న తమను ఎస్‌ఐ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, బెదిరింపులకు పాల్పడంతో పాటు అబ్దుల్‌ సత్తార్‌, అబ్దుల్‌ రహీంకు సహకరిస్తున్నట్లు బాధితులు ఆరోపించారు. పాట్ల విషయంలో కోర్టులో న్యాయ విచారణ జరిగే వరకు తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఘటనకు సంబంధించి ఎస్‌ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. ఎవరిపై తాను బెదిరింపులకు పాల్పడలేదని, కోర్టు ఆర్డర్‌ ఎవరికీ ఉంటే వారే ప్లాట్లలో నిర్మాణం చేసుకోవాలని చెప్పానన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

- 14మందికి గాయాలు


ఉప్పర్‌పల్లి గేటు వద్ద బోల్తాపడిన ఆటో..


గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న దృశ్యం

మక్తల్‌: ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందగా మరో 14మందికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ఉపర్‌పల్లి గ్రామ స్టేజీ వద్ద శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. వివరాలు.. మక్తల్‌కు చెందిన 15మంది లింగంపల్లికి ఆటోలో ఓకా ర్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నారు. ఉప్పర్‌పల్లి గ్రామ స్టేజీ దగ్గరకు రాగానే ఆటో బోల్తా పడగా తీవ్రంగా గాయపడ్డ శారదమ్మ(35) ఆ స్పత్రికి తరలించగా మృతిచెందింది. నర్సమ్మ, గజలప్ప, సంధ్య, మహాదేవమ్మ, అఖిల్‌, మంజుల, లింగమ్మ, అంజమ్మ, సాబేమ్మ, శంకర్‌, శివశంకర్‌, మహదేవమ్మతో పాటు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. శారదమ్మ, నర్సమ్మ, సంధ్యలను జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శారదమ్మ మరణించింది. ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి ఘటనా స్థలికి చే రుకొని గాయపడ్డవారిని 108లో మక్తల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రీక్వార్టర్స్‌లో పాలమూరు జట్టు

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: అఖిల భారత దక్షిణ ప్రాంత ఇంటర్‌ యూనివర్సిటీ పోటీల్లో పీయూ క్రికెట్‌ జట్టు ప్రీక్వార్టర్‌ ఫైనల్‌కు చేరుకుంది. తమిళనాడులోని యూనివర్సిటీ ఆఫ్‌ మద్రాస్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో మూడో మ్యాచ్‌ కలస లింగం అకాడమీ ఆఫ్‌ రీసెర్చ్‌ అండ్‌ ఎడ్యుకేషనల్‌ యూనివర్సిటీపై 15 పరుగుల తేడాతో, నాలుగో మ్యాచ్‌ డా.ఎంజీఆర్‌ ఎడ్యుకేషనల్‌ అండ్‌ రీసెర్చ్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ తమిళనాడుపై 103 పరుగుల తేడాతో పాలమూరు యూనివర్సిటీ జట్టు విజయం సాధించింది. బ్యాటింగ్‌లో డేవిడ్‌ క్రిపాల్‌ 31 బంతుల్లో 54 పరుగులు, రాహుల్‌ 31 బంతుల్లో 44 పరుగులు తీశారు. బౌలింగ్‌లో శశాంక్‌ నాలుగు, డేవిడ్‌ క్రిపాల్‌, ముకీత్‌ రెండేసి వికెట్లు తీసి విజయంలో కీలకపాత్ర పోషించారు. కాగా, ఈ క్రీడాకారులను పీయూ వీసీ జి.ఎన్‌.శ్రీనివాస్‌, రిజిస్ట్రార్‌ డా.చెన్నప్ప, ఓఎస్‌డీ డా.మధుసూదన్‌రెడ్డి, పీడీ వై.శ్రీనివాసులు ఫోన్‌లో అభినందించారు.

జనరల్‌ ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ సేవలు

- ఉగాది నుంచి రోగులకు అందుబాటులోకి తీసుకొస్తాం
- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా


జిల్లా ఎమ్మెల్యేలు, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహా

పాలమూరు: మహబూబ్‌నగర్‌ ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలో రూ.10కోట్లతో ఎంఆర్‌ఐ స్కానింగ్‌ మిషన్‌ ఏర్పాటు చేసి వచ్చే ఉగాది నుంచి ఎంఆర్‌ఐ సేవలు రోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదార రాజనర్సింహ అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లాలో ఆస్పత్రుల అభివృద్ధి కోసం దాదాపు రూ.100 కోట్ల నిధులు కేటాయిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలతో పాటు డీఎంహెచ్‌ఓలు, సూపరింటెండెంట్‌లతో శుక్రవారం ఆస్పత్రులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మహబూబ్‌నగర్‌ జనరల్‌ ఆస్పత్రిని కార్పొరేట్‌ ధీటుగా అభివృద్ధి చేస్తామని త్వరలో పాలమూరు ఆస్పత్రిలో కార్డియాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి సూపర్‌ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఉమ్మడి పాలమూరులో సూపర్‌ స్పెషాలిటీ సేవలు లేకపోవడం వల్ల ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోందని ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. దీంతో జనరల్‌ ఆస్పత్రిలో త్వరలో సూపర్‌ స్పెషాలిటీ విభాగాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఐదు మెడికల్‌ కళాశాలలు, జనరల్‌ ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి కావాల్సిన ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఇందుకోసం రూ.100 కోట్లు ఖర్చు అవుతాయని ప్రాథమికంగా అంచనా వేసి సివిల్‌ పనులు, పరికరాలు, ఇతర సర్వీస్‌లకు సంబంధించి పూర్తి వివరాలతో వేరు వేరుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఉమ్మడి జిల్లాలో అవసరమైన చోట నూతన సబ్‌ సెంటర్లు, పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భౌగోళిక పరిస్థితులు, ఆస్పత్రుల మధ్య దూరం, జనాభా తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని కొత్త సబ్‌సెంటర్లు, పీహెచ్‌సీలు, ఇతర ఆస్పత్రుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రోగుల తాకిడికి అనుగుణంగా దయాలసిస్‌ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా నాలుగు సెంట్రల్‌ మెడిసినల్‌ స్టోరేజ్‌ సెంటర్లు ఏర్పాటు చేశామని, మెడిసిన్‌ రవాణా, పర్యవేక్షణ కోసం జిల్లాకు ఒక త్రీ మెన్‌ కమిటీలు వేశామన్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించే విధంగా డీఎంహెచ్‌ఓ లు, ఆస్పత్రి సూపరింటెండెంట్‌లు చూసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో ఆకస్మికంగా తనిఖీల కోసం రాష్ట్రస్థాయిలో టాస్క్‌ఫోర్స్‌ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, రాజేష్‌, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మేఘారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిరంజన్‌ షావలీ గంధోత్సవం


అచ్చంపేటలో గంధోత్సవం ఊరేగింపు

అచ్చంపేట/ మన్ననూర్‌/ ఉప్పునుంతల: అచ్చంపేట మండలం రంగాపూర్‌ హజ్రత్‌ నిరంజన్‌ షావలీ దర్గా గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక జామే మసీదు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 9.30 గంటలకు రంగాపూర్‌ ఉర్సు గంధోత్సవం ప్రారంభమైంది. అచ్చంపేటకు చెందిన పటేల్‌ వంశీయులైన నారాయణ ప్రసాద్‌ చిన్న కుమారుడు మన్నూప్రసాద్‌ 21 ఏళ్లుగా గంధం వేడుకలు నిర్వహిస్తున్నారు. మారుతీనగర్‌లోని మహెల్లి ఇంటి నుంచి ప్రత్యేక కారుపై అలంకరించిన పంకాను మన్నుప్రసాద్‌ ఇంటికి చేరిన తర్వాత శేషు పటేల్‌ ఇంట్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధోత్సవం బయలుదేరింది. జిల్లా నలుమూలల నుంచే కాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు గంధోత్సవం తిలకించేందుకు శుక్రవారం రాత్రి రంగాపూర్‌ చేరుకున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ ఉర్సుకు హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా ప్రజలు తరలివచ్చారు. అచ్చంపేటలోని నారాయణ ప్రసాద్‌ ఇంటి నుంచి గంధాన్ని తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. అచ్చంపేటతోపాటు మన్ననూర్‌, అమ్రాబాద్‌, బల్మూర్‌, బొమ్మన్‌పల్లి, నాగర్‌కర్నూల్‌, లింగాల, ఉప్పునుంతల, తెలకపల్లి, కొల్లాపూర్‌, వనపర్తి, మహబూబ్‌నగర్‌ ప్రాంతాల నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకవస్తారు. అమ్రాబాద్‌, బొమ్మన్‌పల్లి నుంచి వచ్చే గంధం గుర్రంపై రావడం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. సీబీఎం ట్రస్టు చైర్మన్‌, ఎమ్మెల్యే వంశీకృష్ణ సతీమణి డాక్టర్‌ అనురాధ ప్రత్యేక పూజలు నిర్వహించి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు మేరాజ్‌, అజ్మత్‌, బాబ, అజ్జు, జమీల్‌, నిరంజన్‌, జావీద్‌, అనీష్‌, ఖరీం, నసీర్‌, జమాల్‌, సాజన్‌, వాజీద్‌, ఇస్మాయిల్‌, రహెమాన్‌, ఖాదర్‌, రహీం, మన్సూర్‌, ఖలీమ్‌, జాఫర్‌, బాబలి, సుల్తాన్‌, జాహంగీర్‌, హమీద్‌, రఫీ, జావిద్‌, ఇంతియాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

SERVICES

BUSINESS OFFER
కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్ట్‌ల, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి. DMA స్వాగతం. జీతం+కమీషన్‌. 9671637906. [T-299]

BUSINESS SERVICES
మీ బంగారం బ్యాంక్‌లో, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్‌ ధరకు కొనబడును. 9177555694 [SCA25001126]

DISTRIBUTORS
Wanted Distributors for our Packaged Drinking Water Bottle under the brand name " PURE " in Telangana 9063254533 [SCA25001166]

WANTED
హాలేక్ష్మ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్‌/నర్సులు కావలెను. శ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640468899, 9640258899 [SCA25001191]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్‌

హ్యాబీస్.. హ్యాపీస్

కొంతమంది చిన్న చిన్న విషయాలకే ఆందోళన పడిపోతుంటారు. కొందరు ఎన్ని బాధలు ఎదురైనా సంతోషంగా ఉండేందుకు ప్రయత్నిస్తుంటారు. సంతోషంగా ఉండటమనేది పూర్తిగా మన వ్యక్తిత్వం, అలవాట్ల పైనే ఆధారపడి ఉంటుందని నిపుణులు అంటారు. వీళ్లు ఎన్ని బాధలు ఎదురైనా సంతోషాన్ని దూరం చేసుకోరు. అదెలా సాధ్యం? సంతోషంగా ఉండే వారి అలవాట్లు ఏంటో తెలుసుకుందామా?





సంతోషంగా ఉండేవారు కుటుంబంతోనూ, స్నేహితులతోనూ ఎక్కువ సమయం గడపడటానికి ఇష్టపడతారని, వీరిని కష్టాలు, బాధలు చుట్టిముట్టినప్పుడు తమ కుటుంబం, స్నేహితులతోనే వాటిని పంచుకుంటూ మనసు తేలిక చేసుకుంటారన్నది హ్యాపీ పీపుల్ హ్యాబిట్స్‌లో బయట పడిన విషయం. వీరు తాము సంతోషంగా ఉంటూ, తమ కుటుంబాన్ని, స్నేహితులనూ కూడా సంతోషంగా ఉండేలా చూస్తారు.

పొద్దున్నే నిద్రలేవడం

సంతోషంగా ఉన్న వ్యక్తులు ఉదయాన్నే నిద్రలేస్తారు. పని ఉన్నా... లేకున్నా పొద్దున్నే లేవడం మానుకోరు. తమకు తాముగా కొన్ని నిబంధనలు, పరిమితులు విధించుకుని తమ రోజును ప్రారంభిస్తారు. అలాగే వ్యాయామం, ఆధ్యాత్మిక చింతన, కొత్త విషయాలను తెలుసుకోవడం, పరిశోధనలు, అధ్యయనం వంటి వాటితో నాణ్యమైన సమయాన్ని గడుపుతారు.

ధ్యానం

సంతోషంగా ఉన్నవారు ధ్యానంలో ఎక్కువ సమయాన్ని గడుపుతారు. ధ్యానంతోనే తమ ప్రతికూల ఆలోచనలను నియంత్రిస్తారు. సానుకూలతను పొందడానికి ప్రయత్నిస్తారు. సంతోషకరమైన, స్వీయ–అవగాహన ఉన్న వారికి ధ్యానం ఒక ముఖ్యమైన అలవాటు.

ప్రకృతిలో గడపడం

ఎప్పుడూ సంతోషంగా ఉండేవారు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడంతోపాటు ప్రకృతితో మంచి సమయాన్ని గడపడాన్ని ఇష్టపడతారు. ఇది మానసిక స్థితిని ప్రభావితం చేస్తుంది. మనస్సును నిర్మలంగా ఉంచుతుంది. నకారాత్మక ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెడుతుంది. అలాగే తమతో తాము మరింతగా కనెక్ట్ అయ్యేలా చేస్తుంది.



ఆరోగ్యకరమైన ఆహారం

సంతోషంగా ఉన్న వ్యక్తులు క్రమం తప్పకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్నే తినడానికి ప్రయత్నిస్తారు. అలాగే ప్రతిరోజూ ఉదయం బ్రేక్ ఫాస్ట్ తో పాటు తగినన్ని నీటిని తాగుతారు.



కంటినిండా నిద్ర

మన శరీరానికి నిద్ర చాలా చాలా అవసరం. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ రాత్రి 7 నుంచి 9 గంటల రాత్రి నిద్ర చాలా అవసరం. నాణ్యమైన నిద్ర మనసును సంతోషంగా ఉంచుతుంది. తగినంత నిద్ర లేనివారు చికాకు పడుతూ చిర్రుబుర్రులాడటం చూస్తూనే ఉంటాం.

కనీస వ్యాయామం

ఎప్పుడు చూసినా ఉత్సాహంగా.. ఉల్లాసంగా ఉండేవారు శరీరానికి, మెదడుకూ కూడా తగినంత వ్యాయామం కల్పిస్తారని పరిశోధనలలో తేలింది. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ కనీసం వాకింగ్, రన్నింగ్, జాగింగ్, తేలికపాటి బరువులు ఎత్తడం, లిఫ్ట్ ఉపయోగించకుండా మెట్లెక్కడం, గార్డెనింగ్ వంటి శారీరక వ్యాయామంతోపాటు మెదడును పదును పెట్టే చెస్, బిజినెస్, క్రాస్‌వర్డ్స్ పూరించడం, సుడోకు వంటి వాటిలో పాల్గొనడం వల్ల సంతోషంగా ఉండగలరు.

అంటే మన అలవాట్లు... అదేనండీ.. హాబీసే... హ్యాపీస్ అన్నమాట. కాబట్టి మంచి అలవాట్లతో మరింత సంతోషంగా జీవిద్దాం.

లైఫ్@360

• ప్లీజ్ క్లీన్

వాడర్ బాటిల్



ఒకప్పుడు ప్రయాణాలలో మాత్రమే వెంట తీసుకెళ్లే వాటర్ బాటిల్స్‌ని ఇప్పుడు మనం పని చేసే సిస్టమ్ పక్కన లేదా మంచం పక్కన పెట్టుకోకుండా ఉండలేని పరిస్థితి వచ్చింది. ఎప్పుడు కావాలంటే అప్పుడు తాగేందుకు వీలుగా వాటర్ బాటిల్స్‌ని దగ్గర పెట్టుకోవడం వరకు తప్పేం లేదు కానీ, వాటిని సరిగా శుభ్రం చేయకపోవడం వల్ల వాటి మీద మిలియన్లకొద్దీ సూక్ష్మజీవులు పేరుకుని పోయి రకరకాల జబ్బులు వస్తున్నాయని హెచ్చరిస్తున్నారు వైద్య, ఆరోగ్య పరిశోధకులు.

తాళం చెవులు, సెల్‌ఫోన్, మనీపర్స్, హ్యాండ్ బ్యాగ్‌లాగే వాటర్ బాటిల్ కూడా తప్పనిసరిగా వెంట తీసుకునిపోయే అవసరంగా మారింది. అయితే కొన్ని పరిశోధనల ప్రకారం తేలిందేమిటంటే, వాటర్ బాటిల్‌ను సరిగా శుభ్రం చేయకపోవడం వల్ల టాయిలెట్ సీట్ మీద కన్నా ఎన్నో ఎక్కువ రెట్లు సూక్ష్మజీవులు, బాటిల్ మీద, లోపల, మూత మీద బ్యాక్టీరియా పేరుకుపోతుందట. మనం ఇప్పుడు చెప్పుకోబోయే విషయాలు వినడానికి కొంచెం వింతగా... మరి కొంచెం బాధాకరంగా కూడా ఉండచ్చు. అయినా, చెప్పుకోక తప్పదు మరి!

స్ట్రా ద్వారా తాగే బాటిల్స్, సిప్పర్ బాటిల్స్, అలాగే నోటికి కరిపించుకుని తాగే బాటిల్స్... ఈ మూడు రకాల బాటిల్స్‌లోనూ రెండు రకాలైన బ్యాక్టీరియాను కనుగొన్నారు పరిశోధకులు. ఈ బ్యాక్టీరియా టైఫాయిడ్‌ను కలిగిస్తుంది. అందువల్ల తిరిగి వాడే వాటర్ బాటిల్స్‌ను తీరుబడిగా వారానికోసారి కాకుండా ప్రతిరోజూ సబ్బునీటితో, వేడి నీటితో శుభ్రంగా కడిగి ఉపయోగించడం చాలా మంచిది లేదంటే వ్యాధుల బారిన పడటం ఖాయం మరి!

• యోగా

వెన్నునొప్పి నివారణకు గోముఖాసన

ఆవు ముఖ భంగిమను పోలి ఉంటుంది కాబట్టి దీనికి గో ముఖాసన అని పేరు. శరీరం మొత్తం స్ట్రెచ్ అవుతుంది. కాళ్లు ఒకదానికి మీద ఒకటి చేరే ఈ ఆసనం చూడ్డానికి ఆవు ముఖంలా కనిపిస్తుంది. చేతులు ఆవు ముఖం చెవులను సూచిస్తాయి.

ఇలా చేయాలి..

- ముందుగా సౌకర్యంగా చాప మీద కూర్చోవాలి. ఎడమ కాలును మోకాలి వద్ద వంచుతూ కుడి తుంటి భాగానికి దగ్గరగా తీసుకువెళ్లాలి.
- మోకాళ్లు ఒకదానిపై ఒకటి ఉండేలా సెట్ చేయాలి.
- కుడి చేతిని పైకి లేపి, మోచేయి వద్ద వంచి, వీపు కిందకు ఉంచాలి.
- ఎడమ చేతిని వీపు వెనకకు తీసుకువెళ్లి, కుడి చేతిని పట్టుకోవడానికి ప్రయత్నించాలి.
- రెండు చేతులు కలవకపోతే ఆ ఖాళీని భర్తీ చేయడానికి టవల్ లేదా స్కార్ఫ్‌ను ఉపయోగించాలి.
- వెన్నెముకను నిటారుగా ఉంచి, కూర్చోవాలి.
- దీర్ఘ శ్వాస తీసుకొని, వదులుతూ సౌకర్యంగా అనిపించేంత వరకు ఈ ఆసనంలో ఉండచ్చు.
- మెల్లగా కాళ్లు, చేతులు విడదీసి యధాస్థితికి రావాలి. రెండోవైపు పై విధంగానే చేయాలి.

ప్రయోజనాలు..

డెస్క్ ఉద్యోగాలు చేసేవారిలో బ్యాక్ పెయిన్, హిప్ స్ట్రెస్ సాధారణంగా గమనిస్తుంటాం. వెన్నెముక స్ట్రెచ్ అవ్వడం వల్ల బ్యాక్‌పెయిన్ సమస్య తగ్గుతుంది. తుంటి, రక్తప్రసరణ, కీళ్ల కదలికలు మెరుగవుతాయి. దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదలడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

వెన్ను, మోకాలు గాయాలు ఉన్నవారు నిపుణుల సాయం తీసుకోవాలి. కింద కూర్చొనేటప్పుడు కుషన్‌ను కాలు మడతల్లో ఉంచవచ్చు. తుంటి నొప్పి వస్తుంటే సాధారణ సుఖాసనలో కూర్చొని కూడా ఈ ఆసనాన్ని సాధన చేయవచ్చు.



చెప్పుకోదగ్గ విశేషం

పాదరక్షలు సురక్షితమైన నడకకు అత్యవసరాలు. పాదరక్షల ప్రయోజనం అక్కడికే పరిమితం కాలేదు. ఫ్యాషన్‌రంగంలోనూ పాదరక్షల పాత్ర పెరుగుతూ వస్తోంది. ఫ్యాషన్ స్థాయిని దాటిన అల్ట్రాలగ్జరీ పాదరక్షలు లేటెస్ట్ ట్రెండ్. ఈ పాదరక్షలు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనవిగా రికార్డులకెక్కాయి. వీటిని కొనాలంటే, ఒక మోస్తరు సంపన్నుల ఆస్తులు కూడా చాలవు. ఇవి 'మూన్ స్టార్ షూస్'. దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా గౌరవార్థం ఇటాలియన్ డిజైనర్ ఆంటోనియో వీట్రీ వీటికి రూపకల్పన చేశారు. ప్రపంచంలోనే అతి ఎత్తయిన కట్టడం బుర్జ్ ఖలీఫా ఆకారాన్ని తలపించేలా రూపొందించిన ఈ పాదరక్షల ఖరీదు 19.9 మిలియన్ డాలర్లు. అంటే, రూ.164 కోట్లు. ఈ పాదరక్షల జత తయారీకి బంగారం, వజ్రాలతో పాటు గ్రహాంతర పదార్థాన్ని కూడా ఉపయోగించారు. అందుకే వీటి ధర అంతరిక్షాన్ని తాకే స్థాయిలో ఉంది.



ఈ పాదరక్షల అడుగుభాగాన్ని తెల్లబంగారంతో తయారు చేశారు. పైభాగాన్ని పూర్తిగా మేలిమి బంగారంలో 30 కేరట్ల వజ్రాలను పొదిగి తయారు చేశారు. వీటి తయారీ లో క్రీస్తుశకం 1576లో అర్జెంటీనాలో రాలిపడిన ఉల్క నుంచి సేకరించిన పదార్థాన్ని కూడా ఉపయోగించడం విశేషం.

సాక్షి సినిమా



• 'దిల్' రాజు, ఐశ్వర్యా రాజేశ్, వెంకటేశ్, అనిల్ రావిపూడి, శిరీష్

ఇది తెలుగు ప్రేక్షకుల విజయం

\- వెంకటేశ్

''కష్టపడి పని చేస్తే ఫలితం వస్తుందని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని 'సంక్రాంతికి వస్తున్నాం' విజయం మరోసారి రుజువు చేసింది. ఇది మా విజయమే కాదు.. ఇంత గొప్పగా సపోర్ట్, లవ్ చేసిన తెలుగు ఆడియన్స్, ఫ్యాన్స్ సక్సెస్. ఇది తెలుగు ప్రేక్షకుల విజయం'' అని హీరో వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'పొంగల్ బ్లాక్ బస్టర్ జాతర సెలబ్రేషన్స్'లో వెంకటేశ్ మాట్లాడుతూ– ''డైరెక్టర్ అనిల్, నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్‌గార్లకు, సినిమా యూనిట్‌కి థ్యాంక్స్. ఫిల్మ్ ఇండస్ట్రీలోని అందరూ మనస్ఫూర్తిగా ఫోన్ చేసి సినిమా బాగుందని అభినందిస్తున్నందుకు ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''మేము ఊహించినదానికంటే సినిమాని ఎక్కువ స్థాయికి తీసుకెళ్లిన తెలుగు ప్రేక్షకులకు నా పాదాభివందనాలు. ఈ సినిమాతో నా కెరీర్‌లో ఎనిమిది సక్సెస్‌లు అంటున్నారు... ఆడియన్స్ సపోర్ట్ లేకపోతే నాకు ఈ విజయం వచ్చేది కాదు'' అన్నారు. ''వెంకటేశ్‌గారు నిర్మాతల బాగు కోరుకుంటారు. కాబట్టే ఇప్పటికీ కాలర్ ఎగరేస్తూ ముందుకు వెళ్తున్నారు'' అని శిరీష్ పేర్కొన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''అనిల్, వెంకటేశ్‌గారి కాంబినేషన్‌లో సినిమా అంటే పాజిటివ్ వైబ్రేషన్. ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్'' అని చెప్పారు. ''నేను చేసిన భాగ్యం పాత్ర క్రెడిట్ అంతా అనిల్‌గారికే దక్కుతుంది'' అన్నారు ఐశ్వర్యా రాజేశ్. ఈ వేడుకలో నటులు అవసరాల శ్రీనివాస్, శ్రీనివాస్ వడ్లమాని, మురళీధర్ గౌడ్, కెమెరామేన్ సమీర్ రెడ్డి, ఆర్ట్ డైరెక్టర్ ఏఎస్ ప్రకాశ్, ఎడిటర్ తమ్మిరాజు, రచయితలు అజ్జు మహాకాళి, నాగ్, సాయి కృష్ణ తదితరులు మాట్లాడారు.

ఆహా ఏమి రుచి...






• చేపల కూర వండుతున్న నాగ చైతన్య

కట్టెల పొయ్యి వెలిగించారు నాగ చైతన్య. ఎందుకంటే చేపల పులుసు వండటానికి. వండాక అందరికీ వడ్డించారు కూడా. అందరూ 'బాగుంది' అని మెచ్చుకుంటూ, ఫుల్లుగా లాగించేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. ఇంతకీ చైతన్య ఇలా చేపల కూర వండటానికి కారణం ఏంటంటే... ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికే. 'తండేల్' చిత్రంలో ఈ హీరో మత్స్యకారుడి పాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. విశాఖపట్నం, శ్రీకాకుళం తీర ప్రాంతాల్లోనూ ఈ చిత్రం షూటింగ్ జరిపారు. కాగా, 'మీ స్టయిల్‌లో చేపల కూర వండి పెడతా' అని విశాఖలో చిత్రీకరణలో పాల్గొన్నప్పుడు నాగచైతన్య అన్నారట. అన్నట్లుగానే చేపల కూర వండారు. కూర వండాక, అర చేతిలో కాస్త పులుసు వేసుకుని, రుచి చూసి, పక్కనే ఉన్న అమ్మాయికి ఇస్తే, 'బాగుందండి...' అని ఆమె అనడం, ఆ తర్వాత చైతు అక్కడ ఉన్నవారికి పులుసు వడ్డించి తాను కూడా తినడం వంటివన్నీ చిత్రీకరించి, ఆ వీడియోను షేర్ చేసింది చిత్రబృందం. ఇక ఆ వీడియోలో 'బాగుందా' అని చైతన్య అడగ్గా... ఆహా ఏమి రుచి అనే టైపులో 'బాగుంది.. చాలా బాగుంది' అంటూ అక్కడివాళ్లు తింటుంటే... 'పక్కానా... బాగోకపోతే ఏమీ అనుకోమాకండి... ఫస్ట్ టైమ్' అంటూ, వాళ్లతో కలిసి తానూ తిన్నారు చైతన్య. ఇక శ్రీకాకుళానికి చెందిన మత్స్యకారుల జీవిత కథతో రూపొందుతున్న 'తండేల్'లో నాగచైతన్య సరసన సాయి పల్లవి నటిస్తున్నారు. చందు మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 7న రిలీజ్ కానుంది.

మంచి మాట వినాలి



• పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు: పార్ట్–1 స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. నిధీ అగర్వాల్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి, బాబీ డియోల్ తదితరులు ముఖ్య పాత్రధారులు. ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 28న రిలీజ్ కానుంది. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించిన 'హరి హర వీరమల్లు' నుంచి 'మాట వినాలి..' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. 'మాట వినాలి గురుడా మాట వినాలి... మాట వినాలి... మంచి మాట వినాలి...' అంటూ సాగే ఈ పాటని పవన్ కల్యాణ్ పాడారు. ఈ పాటను పెంచల్ దాస్ రాశారు. ఈ చిత్రం ఐదు భాషల్లో రిలీజ్ కానుంది. ఈ క్రమంలో ఈ పాటను తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ వెర్షన్‌లోనూ రిలీజ్ చేశారు.



• ప్రియాంకా చోప్రా

లాస్ ఏంజెల్స్ టు హైదరాబాద్

ప్రముఖ హీరోయిన్ ప్రియాంక చోప్రా హైదరాబాద్‌లో అడుగుపెట్టారు. అందులో విషయం ఏముందీ అనుకోవచ్చు. సింగర్, యాక్టర్ నిక్ జోనాస్‌తో పెళ్లి తర్వాత అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో స్థిరపడ్డారు ప్రియాంక. ఇప్పుడు ఇలా హైదరాబాద్‌లో అడుగుపెట్టడానికి కారణం ఏంటి? అనేది హాట్ టాపిక్‌గా మారింది. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా కోసమే ఆమె భాగ్యనగరానికి చేరుకున్నారని టాక్. ఈ చిత్రంలో మహేశ్‌బాబుకి జోడీగా నటించే హీరోయిన్ల జాబితాలో ప్రియాంకా చోప్రా, కియారా అద్వానీ, ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ వంటి వారి పేర్లు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా ప్రియాంకా చోప్రాని కథానాయికగా ఫిక్స్ చేశారని భోగట్టా. ప్రియాంకా చోప్రా లాస్ ఏంజెల్స్ నుంచి హైదరాబాద్‌కి చేరుకోవడంతో ఈ మూవీ చిత్రీకరణ కోసమే ఆమె వచ్చారనే రూమర్లు వినిపిస్తున్నాయి. మరి... ఈ వార్త ఎంతవరకూ నిజమో తెలియాల్సి ఉంది.

శివరాత్రికి థ్రిల్



• ప్రజ్వల్ దేవరాజ్

కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటిస్తున్న చిత్రం 'రాక్షస'. లోహిత్ .హెచ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 26న కన్నడతో పాటు తెలుగులోనూ రిలీజ్ కానుంది. తెలుగు విడుదల హక్కులను కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ అధినేత ఎంవీఆర్ కృష్ణ దక్కించుకున్నారు. గతంలో శివరాజ్ కుమార్ హీరోగా నటించిన 'వేద' చిత్రాన్ని ఆయన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎంవీఆర్ కృష్ణ మాట్లాడుతూ– ''హారర్ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'రాక్షస'. మా సినిమా ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. త్వరలోనే టీజర్, ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం'' అని చెప్పారు.

వెరైటీ యాక్షన్



• సత్య

సత్య వినుగొండ, అనుశ్రీ లీడ్ రోల్స్‌లో ఎస్ఎస్ మూవీ కార్పొరేషన్ పై సత్య వినుగొండ స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'వాషింగ్టన్ సుందర్'. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను 'జాతి రత్నాలు' దర్శకుడు అనుదీప్ ఆవిష్కరించారు. సత్య వినుగొండ మాట్లాడుతూ– ''వెరైటీ యాక్షన్ నేపథ్యంలో సాగే ఫన్ ఎంటర్‌టైనర్ మూవీ ఇది. మార్చిలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అని తెలిపారు.

నీకు దెబ్బలేమీ తగల్లేదు కదా...



• సోనూగా... లైలాగా విశ్వక్

విశ్వక్ సేన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆకాంక్షా శర్మ హీరోయిన్‌గా నటించారు. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. 'చూసుకో... అయ్యయ్యో నీకు దెబ్బలేమీ తగల్లేదు కదా', 'మనకు తెల్లగ జేసుడే కాదు... తోలు తీసుడు కూడా వచ్చు' అంటూ విశ్వక్ సేన్ చెప్పే డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''రొమాంటిక్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'లైలా'. ఈ మూవీలో మోడల్ సోనూగా, లైలా అనే అమ్మాయిగా విశ్వక్ సేన్ కనిపించే రెండు డిఫరెంట్ లుక్స్ సినిమాపై బజ్ క్రియేట్ చేశాయి'' అని యూనిట్ పేర్కొంది.

సుకృతి నటన చూసి షాక్ అయ్యాను

\- సుకుమార్



• నవీన్, రవిశంకర్, సుకుమార్, సుకృతి, తబితా సుకుమార్, పద్మావతి, శేష సింధూరావు

''నా కుమార్తె సుకృతికి చిన్నప్పటి నుంచి పాడటం అంటే చాలా ఇష్టం. కానీ, నటన మీద పెద్దగా ఆసక్తి లేదు. తను నటిస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. అయితే దర్శకురాలు పద్మ, నిర్మాత సింధు కలిసి సుకృతిని నటించేందుకు ఒప్పించారు. 'గాంధీ తాత చెట్టు'లో సుకృతి నటన చూసిన తర్వాత షాక్ అయ్యాను.. అంత బాగా నటించింది'' అని డైరెక్టర్ సుకుమార్ తెలిపారు. ఆయన కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించారు. సుకుమార్ భార్య తబితా సుకుమార్ సమర్పణలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధూరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుకుమార్ మాట్లాడుతూ– ''ఈ చిత్రం సుకృతి లైఫ్‌లో మంచి జ్ఞాపకంలా మిగిలిపోతుంది. వినోదం, సందేశం ఉన్న 'గాంధీ తాత చెట్టు'ని అందరూ ఆదరించాలి'' అన్నారు. ''ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ పిల్లలతో కలిసి చూడాలి'' అన్నారు యలమంచిలి రవిశంకర్. ''ఈ సినిమా ఎక్కడా బోర్ కొట్టకుండా అందరికీ నచ్చుతుంది'' అన్నారు నవీన్ ఎర్నేని. ''షూటింగ్‌లో తొలి రోజు సుకృతి నటన చూసి హ్యాపీ ఫీలయ్యాను'' అని తబితా సుకుమార్ పేర్కొన్నారు. ''ఒక చెట్టుకు, మనిషికి మధ్య ఉన్న అనుబంధంతో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు పద్మావతి మల్లాది. ''ఈ సినిమా కోసం నాన్న (సుకుమార్) ఎటువంటి సలహాలు ఇవ్వలేదు'' అని సుకృతి బండ్రెడ్డి తెలిపారు.